www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య





నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ఇళ్ల స్థలాల రద్దుకు కసరత్తు!

- 16 వేలకుపైగా ఇళ్ల స్థలాలు గల్లంతు
- నెల రోజుల్లో సర్వే పూర్తికి ఆదేశాలు
- మండలాల వారీగా బృందాలు ఏర్పాటు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో ఇళ్ల స్థలాల రద్దు కసరత్తు ఊపందుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వ హించిన మంత్రి మండలి సమావేశంలో రాష్ట్ర వ్యా ప్తంగా హౌసింగ్ నిర్మాణాలు చేపట్టని లబ్ధి దారుల ఇళ్ల స్థలాలను రద్దు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసిం ది. జిల్లా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సంయుక్తంగా కడప, అన్నమయ్య జిల్లాల్లో ఇళ్ల నిర్మా ణాలు చేపట్టని లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు.

కడప జిల్లాలో 96,335 పక్కా గృహాలు, అన్నమయ్య జిల్లాలో 79,721 లబ్ధి దారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కడపలో 83,491 ఇళ్లు, అన్నమయ్యలో 79,721 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కడప జిల్లాలోని మైదుకూరు, కమలాపురం డివిజన్లలో ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి కనిప ి స్తోంది. కడప, పులివెందుల, ప్రొద్దు టూరు డివిజన్లలో ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితి నెలకొంది. 2024 డిసెంబర్ నాటికి 36,371 వేల ఇళ్లు పూర్తయ్యాయి. ఈలెక్కన 37.75 శాతం మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడం గమనార్హం. కూటమి సర్కా రు హౌసింగ్‌శాఖపై దృష్టి సారిం చింది. ఐదేళ్లుగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టని లబ్ధిదారుల డేటాను సేక ్రిం చింది. ఇళ్లు అవసరం లేని వారి స్థలా లను స్వాధీనం చేసుకోవాలని నిర్ణ యం తీసుకుంది. ఇళ్లు లేని లబ్ధి దారులకు ఇవ్వాలని భావించినట్లు తెలుస్తోంది.

పారదర్శక సర్వేకు ఆదేశాలు

ఉమ్మడి జిల్లాలోని సొంత స్థలాలు, రెవెన్యూ స్థలాలు పొందిన లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధి దారులు, సొంత స్థలాల్లో ఎందరు, రెవెన్యూ స్థలాలకు చెందిన లబ్ధిదారులు ఎందరున్నారో గుర్తించాలని ఆదేశించింది. మూడు కేటగిరీల్లో హౌసింగ్ పనులు చేపడతామని ముందుకు వచ్చిన లబ్ధిదారులను మినహాయించనున్నట్లు తెలుస్తోంది.

నెల రోజుల్లో సర్వే నివేదిక

ఉమ్మడి జిల్లా పరిధిలో హౌసింగ్ పనులు చేపట్టని లబ్ధిదారుల వివరాలకు సర్వేకు శ్రీకారం చుట్టింది. నెల రోజుల వ్యవధిలో సర్వే నివేదికను అందజేయాలని ఆదేశించింది. హౌసింగ్, రెవెన్యూ యంత్రాంగాలు సంయుక్తంగా మండల సాయిలో హౌసింగ్ ఎఇ, తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒ, సచివాలయ కార్యదర్శులతో కూడిన బృందాలు సర్వే ప్రక్రియకు ఉపక్రమించాయి. కడప, అన్న మయ్య జిల్లా హౌసింగ్ శాఖలు ఐదేళ్లుగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల వివరాలను అందజేసిన సంగతి తెలిసిందే.

16,091 స్థలాలు గల్లంతు?

కడప, అన్నమయ్య జిల్లాల్లో 16,091 ఇళ్లస్థలాలపైగా గల్లంతు కానున్నట్లు తెలుస్తోంది. పారదర్శక సర్వే అనంతరం ఇళ్లస్థలాల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో 12, 844 మంది హౌసింగ్ లబ్ధిదారులు, అన్నమయ్య జిల్లాలో 3,247 మంది లబ్ధిదారుల ఇళ్ల స్థలాలు వెరసి 16,091 మంది ఇళ్లస్థలాల వివరాలను అందజేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్, రెవెన్యూ బృందాల పారదర్శక సర్వే ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ప్రేమోన్మాది అరెస్టు

- గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- తనకు దక్కనిది మరెవ్వరికీ దక్కకూడదనే ఘాతకం
- నిందితుడికి తప్పకుండా శిక్ష పడుతుంది
- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సైకో, ప్రేమోన్మాది యువతిపై యాసిడ్ దాడికి తెగబడిన నిందితుడిని గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడికి కచ్చితంగా శిక్ష పడుతుందని ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు. శనివారం మదనపల్లె డిఎస్‌పి కార్యాలయంలో ప్రేమోన్మాది నిందితుడు గణేష్‌ను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ యువతిపై యాసిడ్ దాడి, ఆపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని గంటల వ్యవధిలో, జిల్లా దాటకుండా పట్టుకున్నామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని తెలిపారు. మదనపల్లె పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న శంకారపు మురళి కుమారుడు శంకారపు గణేష్ గుర్రంకొండ మండలం, నడిమికండ్రిగ పంచాయతీ, ప్యారంపల్లికి చెందిన జనార్ధన కుమార్తె గౌతమి మదనపల్లిలోని ఓ ప్రయివేటు కళాశాలలో చదువుకున్నారని తెలిపారు. అప్పటినుంచి ప్రేమ పేరుతో గౌతమిని గణేష్ వేదించేవాడని, ఆమె నిరాకరించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలో గౌతమికి తన మేనత్త కుమారుడితో ఈ నెల 7వ తేదీన నిశ్చితార్థం కాగా ఏప్రిల్ 29న వివాహం కానుంది. దీన్ని జీర్ణించుకోలేని గణేష్ తనకు దక్కని గౌతమి మరెవ్వరికీ దక్కకూడదన్న కక్షతో ఆమెపై పగపెంచుకుని అఘాయిత్యానికి పన్నాగం పన్నాడన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం యాసిడ్ కొనుగోలు చేసి గౌతమిపై దాడి చేసేందుకు శుక్రవారం ఉదయాన్నే ప్రారంపల్లికి చేరుకున్నాడని, గౌతమి ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి చొరబడి ఆమెతో వాగ్వాదానికి దిగాడని పేర్కొన్నారు. ఆపై వెంట తెచ్చుకున్న యాసిడ్ నోట్లో పోసే ప్రయత్నం చేయడంతో ఆమె ప్రతిఘటించగా ముఖంపై చల్లాడన్నారు. ఇంట్లో ఉన్న కత్తితో ఆమె మెడ, గొంతు, చేతులపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించగా ఆమెకు రక్త గాయాలయ్యాయని చెప్పారు. తనపై గణేష్ దాడిని ప్రతిఘటించిన గౌతమి ప్రాణాలు దక్కించుకునేందన్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఈ ఘటనలో ఫిర్యాదు తీసుకున్న పోలీసులు నిందితుడు కోసం గాలింపు చేపట్టారన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు సంఘటన జరగ్గా, బెంగుళూరుకు పారిపోయేందుకు సిద్ధంగా ఉన్న నిందితుడిని మధ్యాహ్నం 3 గంటలకు చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. నిందితుడిపై నేరం రుజువయ్యేందుకు అన్ని ఆధారాలు సేకరించామని కచ్చితంగా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. నిందితున్ని గంటల వ్యవధిలో అరెస్టు చేసేందుకు సహకరించిన డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐలను ఎస్‌పి అభినందించారు.

నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ చేపట్టాలి

- ఐద్వా రాష్ట్ర నాయకులు సాయిలక్ష్మి



ప్యారంపల్లిలో స్థానికులను విచారిస్తున్న ఐద్వా నాయకులు

గౌతమిపై యాసిడ్ దాడి చేసిన నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరిపి, వెంటనే కఠిన శిక్ష అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకులు సాయిలక్ష్మి, జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. శనివారం వారు ఘటనా స్థలం ప్యారంపల్లిని సందర్శించి ఏ విధంగా దాడి జరిగిందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాలు జరిగినప్పుడు సానుభూతి చూపడం కాదని నేరాలను నివారించే చర్యలను చేపట్టాలని తెలిపారు. ప్రేమ పేరిట జరిగిన హత్యాయత్నాన్ని, యాసిడ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి పరామర్శలకు మాత్రమే పరిమితమైతే సరిపోదని, ఆడపిల్లల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో మహిళలపై, యువత, పిల్లలపై పెరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు, దాడులతో తల్లిదండ్రులకు కంటి మీద కునుకు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చెప్పుకునే వాతావరణం కూడా లేకపోవడం దారుణమన్నారు. నేరాలు పెరగడానికి కారణాలేమిటో విశ్లేషించి, వాటి నివారణకు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నామమాత్రపు ఆలోచన కూడా చేయకపోవడం, బాధ్యత వహించక పోవడం విచారకరమన్నారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టేందుకు నిపుణులతో అధ్యయనం చేయడానికి ఓ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టేందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించాలన్నారు. నిధుల కేటాయింపు జరగాలని, మహిళా కమిషన్ నెలవారీ సమస్యల పరిశీలన నివేదిక ఇచ్చే విధంగా హైదరాబాద్ ఆధ్వర్యంలో పరిశీలన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు రెడ్డి ప్రసన్న, ఎం గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మహిళలకు రక్షణ కల్పించి, గౌతమి పై యాసిడ్ దాడికి పాల్పడిన సైకో గణేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక విజయనగర్ కాలనీలో ఐద్వా, ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రేమోన్మాదులు పేట్రేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి గౌతమిపై యాసిడ్ దాడి చేసిన సైకో గణేష్‌ను వెంటనే కఠిన శిక్ష విధించాలని కోరారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే కాలంలో మహిళలపై దాడి చేయాలంటే వణుకు పుట్టేలా శిక్షలు అమలు చేయాలన్నారు. బాధితురాలైన గౌతమి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడంతో పాటు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు రెడ్డి ప్రసన్న, జి.గాయత్రి, లక్ష్మీదేవి, ఎఎన్ఎం నూర్జహాన్, ఆశ పుణ్యవతి పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

రాయచోటి టౌన్ : యాసిడ్ దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని శనివారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో గౌతమి అనే యువతిపై యాసిడ్ దాడికి పాల్పడ్డ ప్రేమో న్మాది గణేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. బాధితురాలు గౌతమిని ప్రేమ పేరుతో వేధించి యాసిడ్ దాడికి పాల్పడ్డ నిందితుడిని నడిరోడ్డుపై ఉరి తీయాలని, రాష్ట్రంలో మహిళ హోం మంత్రి అని చెప్పుకోవడానికి తమకు సిగ్గుచేటుగా ఉందని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ భాగ్య లక్ష్మి ఆరోపించారు. దిశా, నిర్భయ చట్టాలు దేశంలో ఉన్నా మహిళలకు ఏమాత్రం భద్రత కల్పించడం లేదన్నారు. బాధితురాలను మహిళా హోంమంత్రి పరామర్శించకపోవడం బాధాకరమైన విషయమన్నారు. రాష్ట్రంలో మహిళ హోం మంత్రిగా ఉందని ధైర్యంగా ఉండాల్సిన మహిళలు నేడు ఆందోళన చెందాల్సిన అవసరం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా మహిళలపై దాడులు ఆగలేదని, మహిళల భద్రత చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలిచి రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ మహిళలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** గౌతమిని ప్రేమ పేరుతో కత్తితో పొడిచి యాసిడ్ దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా నాయకులు శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. ప్రేమి కుల రోజు ఇటువంటి సంఘటన జరగడం బాధాకరమని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు శాంతి భద్ర తలు విగాథం కలిగించేలా ఉన్నాయని తక్షణమే హోంమంత్రి చర్యలు తీసుకొని రాష్ట్రంలో మహిళల శాంతి భద్రతలకు పటిష్ట చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఇలాంటి సంఘటనల వల్ల ఆడపిల్లల తల్లి దండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారని మహిళలను ఇంటి నుంచి బయటకు పంపించాలంటే తల్లి దండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు వనజ కుమారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు : మంత్రి

ప్రజాశక్తి- రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రాణం ఎంతో విలువైందని, రోడ్డు ప్రమాదాల వల్ల ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా అధికారులు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఆర్‌టిఒ కార్యాలయంలో నిర్వహించిన 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో మంత్రి హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పోలీసు, రవాణా శాఖలు పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై అవసరం మేరకు వేగ నిరోధకాల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి వారికి ఫైన్ వేయాలని సూచించారు. తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయాలని పోలీస్ శాఖ వారికి సూచించారు. ప్రజల ప్రాణాల భద్రతే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రవాణా శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ డ్రైవింగ్ చేసిన బస్సు డ్రైవర్లను శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి ఆర్‌టిఒ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, ఆర్‌టిసి డిఎం ధనంజయ, ఉభయ తెలుగు రాష్ట్రాల డ్రైవర్ల సంఘం అధ్యక్షులు సిద్ధార్ధ గౌడ్ పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో నాణ్యమైన విద్య : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య సమకూరుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం మధ్యాహ్నం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంప్లెక్స్ సమావేశాలను రెండు రోజులపాటు నిర్వహించడం వల్ల ఆయా పాఠశాలలలో బోధన కుంటుపడేదని, సింగల్ టీచర్ పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉండేదన్నారు. ఈ లోటుపాట్లను తొలగించడానికి ఇక నుంచి క్లస్టర్ సమావేశాలను ప్రతినెల మూడవ శనివారం అర్ధ రోజు మాత్రమే నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశాల్లో ఉపాధ్యాయులు తమ తమ ఆలోచనలను ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా వృత్తిపర నైపుణ్యం సమకూరుతుందన్నారు. తమ పాఠశాలల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతుల గురించి ఈ సమావేశాల్లో చర్చించాలన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనలో సాంకేతికతను జోడించడం ద్వారా బోధనతోపాటు అభ్యసనం కూడా సులభం అవుతుందన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, డిజిటల్ వింగ్ జిల్లా నోడల్ అధికారి అశోక్ రెడ్డి, పాఠశాలలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి -వాల్మీకిపురం: మండలంలోని 16 పంచాయతీల రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఎఒ హేమలత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25వ తేదిలోపు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ లేదా 1బి, ఆధార్‌కు లింకు ఉండే మొబైల్ తమ వెంట తెచ్చుకోవాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర పథకాలు వర్తిస్తాయన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి సుమారు 300 కు పైగా అర్జీలు రావడంతో వాటిని స్వీకరించి తక్షణమే సమస్యలను పరిష్క రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్ర బాబు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ప్రతి శనివారం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమ స్యలను తెలుసుకొని తక్షణమే అధికారులతో కలిసి పరిష్కరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రజలు పట్టాదారు పాసు పుస్తకాలు, బిసి కార్పొరేషన్ రుణాలు, ఇళ్ల పట్టాలు, నూతన రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్డు, తాగునీరు సమస్య, కాలువలు, పరిశుభ్రత తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారని అన్నారు. అన్ని అర్జీలను త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఎంపిడిఒ తాజ్ మస్రూర్, సిడిపిఒ సుజాత, వివిధ శాఖల అధి కారులు, నాయకులు సంగం శ్రీనివాసులు, షంషీర్, బొమ్మిశెట్టి పురుషోత్తం, వెంకట రమ ణారెడ్డి, జంగాల వెంకటరమణ, బీదం గురునాథ్ యాదవ్, కమలామర్రి కృష్ణ, జెసిబి మధుసూదన్ రెడ్డి, చెంద్రాయుడు, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'లో భాగస్వాములు కావాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి -రాయచోటి




కలెక్టరేట్ పరిసరాల్లో శుభ్రం చేస్తున్న డిఆర్ఒ, అధికారులు

జిల్లాను స్వచ్ఛరహితంగా రూపొందించేందుకు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు డిఆర్ఒ, ఎఒ, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది, కలెక్టరేట్‌లో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలెక్టరేట్ కార్యాలయ పరిసరాలలో మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాలను నిర్వహించారు. కలెక్టరేట్ పరిసరాలలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు కూడా వారి కార్యాలయాలలో స్వచ్ఛ దివస్ పాటించి శుభ్రత కార్యక్రమాలను చేశారు. అనంతరం డిఆర్ఒ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈ క్రమంలో ప్రతినెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నెల కొకటి చొప్పున 12 మాసాలకు 12 అంశాలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫిబ్రవరి మాసంలో 'వనరు-మూల వనరు' అంశంతో స్వచ్ఛ కార్యక్రమాలను పాటిస్తున్నామన్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాలలో పోగవుతున్న చెత్తను సమర్ధవంతంగా తొలగించడమే కాకుండా, తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు విడివిడిగా వేరు చేయడం ముఖ్యమన్నారు. ఇందులో భాగంగా ఆకుపచ్చ డస్ట్ బిన్‌లో తడి చెత్తను, నీలం రంగు డస్ట్ బిన్‌లో పొడి చెత్తను, ఎరుపు రంగు డస్ట్ బిన్‌లో ప్రమాదకర, రసాయనిక వ్యర్థాలను వేసి చెత్త సేకరణకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. పరిశుభ్రత పెంపొందించడానికి ప్రజలందరూ దీనిని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని కోరారు. అన్నమయ్య జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిఆర్ఒపేర్కొన్నారు. అనంతరం పాల్గొన్న వారందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది, కలెక్టరేట్‌లో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అర్చన విద్యా సంస్థల దాతృత్వం అభినందనీయం'

ప్రజాశక్తి - రాయచోటి



కలెక్టర్‌కు చెక్‌ను అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

నిరుపేదల ఇంటి గృహాలపై 'సూర్య ఘర్' పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించడానికి సామాజిక బాధ్యత కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల ఏర్పాటు నిమిత్తం అర్చన విద్యాసంస్థల యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రాయచోటి అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.మదన్మోహన్‌రెడ్డి రూ.5,72,512 విలువ గల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈనెల 1న సంబేపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించిన నేపథ్యంలో నలుగురు పేదల ఇళ్లపై ఏర్పాటు చేసిన 2 కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సామాజిక బాధ్యత కింద సదరు సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల ఖర్చును భరించేందుకు అదే రోజు అర్చన విద్యా సంస్థల కరస్పాండెంట్ ముందుకు వచ్చారు. ఈ మేరకు శనివారం అందుకు సంబంధించిన చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్‌ను కలెక్టర్ అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల ప్రతినిధి భరత్ రెడ్డి పాల్గొన్నారు.


పతకాలు సాధించిన ఆఫ్రీన్‌తో అధ్యాపకులు

స్కేటింగ్‌లో ఆఫ్రీన్‌కు బంగారు పతకాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.ఆఫ్రిన్ యోగి వేమన విశ్వవిద్యాలయ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 500 మీటర్లు,1000 మీటర్ల స్కేటింగ్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 24, 25, 26 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న అఖిల భారత స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అపూర్వమైన విజయంతో ఆమె మా కళాశాలకే విశిష్ట గౌరవం తీసుకువచ్చిందని అభినందించారు. కృషి, పట్టుదల, నిబద్ధత ఉంటే ఎలాంటి విజయానికైనా చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసులు, ఆడపాల శివకుమార్, పీడీ పుల్లారావు పాల్గొని జాతీయ పోటీలలో మరింత గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సబ్సిడీ రుణాలకు 312 దరఖాస్తులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం అందిస్తున్న బిసి, ఇబిసి, ఇడబ్ల్యుఎస్, కాపు సహా ఇతర కార్పొరేషన్ల రుణాలకు మండల వ్యాప్తంగా 312 దరఖాస్తులు అందాయని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో బిసి, ఇబిసి, ఇడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ రుణాలను అందిస్తోందని అన్నారు. బిసి కార్పొరేషన్ కింద 50 శాతం సబ్సిడీతో 45 యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్ రూ. 2 లక్షలు గా ఉన్నాయన్నారు. కాపు కార్పొరేషన్ కింద 14 యూనిట్లు మంజూరు కాగా రూ.2లక్షల వంతున ఇద్దరికి, రూ.3లక్షలు వంతున 7 మందికి, రూ.5లక్షలు వంతున 5 మందికి మంజూరైనట్లు తెలిపారు. ఇబిసి కేటగిరీలో 2 యూనిట్లు మంజూరు కాగా, ఇద్దరికి రూ.1.75లక్షలు, రెడ్డి సామాజిక వర్గానికి 2 యూనిట్లు మంజూరు కాగా అందులో ఇద్దరికి రూ.1.75 మంజూరు అయినట్లు తెలిపారు. ఈ రుణాల కోసం 312 దరఖాస్తులు అందాయన్నారు. సబ్సిడీ రుణాలకు అందిన దరఖాస్తులను ఈనెల 16, 17,18,19వ తేదీల మధ్యలో పరిశీలించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఒక్కరోజు ముందుగానే పరిశీలన తేదీని తెలుసుకోవాలన్నారు. **గాలివీడు:** మండలంలోని 17 గ్రామాలకు బీసీ కార్పొరేషన్ కింద 41 యూనిట్లు, కాపు 12 యూనిట్లు, ఇడబ్ల్యుఎస్ 4 యూనిట్లు మొత్తం 57 యూనిట్లకు గాను 500 దరఖాస్తులు అందినట్లు ఎంపిడిఒ సి.వి. జవహర్ బాబు పేర్కొన్నారు. శనివారం చివరి రోజు కావడంతో దరఖాస్తులన్నీ చేరాయని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నందలూరు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆడపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హైమావతి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం గాను 4వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ఆధార్ కార్డుతో మార్చి 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని కోరారు.దరఖాస్తు చేసు కున్న విద్యార్థులకు ఏప్రిల్ 6న ఉదయం 5వ తరగతి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష , అదే రోజు మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. మరిన్ని వివరములకు 8688573061 ఫోన్ నెంబర్ సంప్రదించవలసినదిగా ప్రిన్సిపల్ కోరారు


మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

'రేవూరి'కి నామినేటేడ్ పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేవూరి వేణుగోపాల్‌కు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఇవ్వాలని అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోలంరెడ్డి మల్లిఖార్జున, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్, రాష్ట్ర నాయకులు కమ్మ ల్లయ్య పేర్కొన్నారు. శనివారం బోయి నపల్లిలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కేటాయిస్తామని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ యువతకు పిలుపునిచ్చారన్నాని అన్నారు. నందలూరు మండలానికి చెందిన యువ నాయకుడు రేవూరి వేణుగోపాల్ విద్యార్థి సంఘం నాయకుడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ వరకు స్వయం కృషితో ఎదుగుతున్నాడని అన్నారు. ఇటువంటి నిబద్ధత ఉన్న నాయకులను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేస్తే ప్రభుత్వం మీద, పార్టీ మీద నమ్మకం ఉంటుం దన్నారు. రేవూరి సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధినేత సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులును కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు గౌరవ అధ్యక్షులు చంగల్ రాయుడు, అంబేద్కర్ సేవాసమితి ఉపాధ్యక్షులు చిరంజీవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగితే..

మదనపల్లె జిల్లా అవుతుంది : 'చమర్తి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి తే మదనపల్లె జిల్లా అయ్యే అవకాశం ఉందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు.శనివారం మదన పల్లె పర్యటనకు వచ్చిన ఆయన దేవతా నగం లోని స్థానిక రాజంపేట పార్లమెంటు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అస్తవ్యస్థంగా జిల్లాల ఏర్పాటు జరిగిందన్నారు. వాటిని సరిదిద్దే క్రమంలో సిఎం చంద్రబాబు జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆ ప్రక్రియ జరిగితేనే మదనపల్లి జిల్లా అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో కొన్ని పార్టీ నేతల్లో చిన్నచిన్న పొరపచ్చాలు ఏర్పడినప్పటికీ వాటన్నిటిని త్వరలోనే సరిచేసుకొని అందరం కలసికట్టుగా పనిచేస్తామని చెప్పారు. సామాజిక న్యాయం చేసే క్రమంలో ఎన్నికల సమయంలో అభ్యర్థుల మార్పు జరిగి, కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చినప్పటికీ కూటమి నాయకులు గెలుపే ధ్యేయంగా అందరి కలిసి కట్టుగా పనిచేసి వారిని గెలిపించుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టిడిపి నాయకులు మధు బాబు, దొరస్వామి నాయుడు, సురేంద్ర, పూల మురళి, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



బి.కొత్తకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లె, తవళం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎపిఒ రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, సర్పంచులు పాపులమ్మ మల్లప్ప, రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను బయట ప్రాంతాలలో విచ్చలవిడిగా వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా తీసు కోవాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే, మనం జబ్బుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలిం చారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండలంలోని తట్టివారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి వద్ద నుండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ రోజుకు కొంత సమయాన్ని పరిసరాలను పరిశు భ్రంగా ఉంచేందుకు కేటాయించాలన్నారు. విద్యార్థుల చేత స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, మహిళా పోలీస్ శ్రావణికుమారి, టిడిపి గ్రామ అధ్యక్షులు షామీర్‌బాషా, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు గురప్పనాయుడు, నాగరాజ, భాస్కర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఉపాధ్యాయులు అమరనాథ్, కాశీనాథ్, ఈశ్వర్ నాయక్, శైలశ్రీ, ఆనంద్ పాల్గొన్నారు. **ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో..** ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ఒంటిమిట్టపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తడి చెత్త, పొడి చెత్త పై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వై.అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు అమరేశ్వర్, మంజు బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలో తహశీల్దార్ వెంకటేష్, ఎంపిడిఒ నూర్జహాన్, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. మండల అధికారులతో వారి వారి కార్యాలయాలను శుభ్ర పరచు కుంటామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఈ కార్యక్రమం పై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుతులు అందించారు. అక్కడి నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ కూడలిలో మానవహారం గా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం క్లాప్ మిత్రలకు దుస్తులు, సేఫ్టీ కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎపిఒ నాగరాజు, ఎబిఎం ఖాదరవల్లి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ఇర్ఫాన్, అగ్రికల్చర్ స్వాతి, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఐసిడిఎస్ సరస్వతమ్మ, సూపర్వైజర్లు, సర్పంచ్, సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, కంప్యూటర్ అసిస్టెంట్ సురేంద్ర, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం చేపట్టి ప్రజలకు పరిస రాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ఆరోగ్యానికి పునాది అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం సమాజానికి ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా అని డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ఆరిపుల్లాలు పేర్కొన్నారు. పరిసరాల శుభ్రత కార్యక్రమం నిర్వహిచి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ తడిచెత్త,పొడి చెత్త,వేరుచేసి వేయాలన్నారు.రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కవర్లు వేయకూడదని ప్రతి ఒక్కరూ కవర్లను చెత్తను చెత కుండీలలో వేసే అలవాటును అలవరచుకోవాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్ పల్లవి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కనిపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, ప్రజలు పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల కేంద్రంలోని పుల్లంపేట పంచాయతీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ గురించి ఇంటి యజమానులకు, గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయ పరితరాలను శు భ్రం చేసి చెట్లను నాటారు. రోడ్డు వెంబడి ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. తడి చెత్త , పొడి చెత్త మరియు ప్రమాదకరమైన చెత్తగా విడదీయుట అనే అంశంపై యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల కార్యాలయ ఎఒ వై.శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇన్చార్జి విస్తరణ అధికారి ముత్తయ్య , సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. పీలేరు ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాన్స్కో ఉద్యోగులు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహించారు. ట్రాన్స్కో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి తమ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామపంచాయతీ ఇఒ గురుమోహన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వ హించి, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో ట్రాన్స్కో ఎడిఇ అమీర్, ఎఇలు ఇలాహి, ఉదయ్, సిబ్బంది, పీలేరు మండల ఎంఇఒలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, హెచ్ఎం సురేంద్ర నాథ్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ మదన్మోహన్, టిడిపి నాయకులు పురం రామ్మూర్తి, ఆర్యవైశ్య సంఘ నాయకులు జె.అరవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మద్దిరేవుల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా స్వచ్ఛరహితంగా రూపొందించేందుకు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మద్దిరేవుల సర్పంచి తుమ్మల చంద్రమ్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుచరించి గ్రామంలోని ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతినెలా మూడో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయుటకు గ్రామ అధికారులు ప్రజలు సహకరించాలని తెలిపారు. నెల కొకటి చొప్పున 12మాసాలకు 12 అంశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫిబ్రవరి మాసంలో వనరు-మూల వనరు అంశంతో స్వచ్ఛ కార్యక్రమాలను పాటిస్తున్నామన్నారు.గ్రామ పంచాయతీలోని ఈడిగపల్లి సచివాలయం, హెల్త్ సబ్ సెంటర్‌లో, పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం, చెత్త దిబ్బలు ఎత్తించడం, బ్లీచింగ్ మిశ్రమం చల్లించడంతో పాటు ఇంటింటికీ తిరిగి గ్రీన్ అంబాసడర్లతో తడి చెత్త పొడి చెత్త సేకరణ వంటి కార్యక్రమాలు గ్రామ పంచాయతీ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మల రాధాకృష్ణ, ఏసయ్య, వెంకటరమణ, తిమ్మయ్య, పాఠశాల విద్యార్థులు, సచివాలయం సిబ్బంది విజయ కుమారి, ఆశా అరుణ, అంగన్వాడి టీచర్ నాగవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు. **కలికిరి:** కలికిరి పంచాయతీ సర్పంచ్ ఆర్.ఎల్లయ్య, ఇఒ అశోక్, టిడిపి నాయకులు రెడ్డివారి యోగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది సచివాల సిబ్బందితో కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు యోగేశ్వర్ రెడ్డి హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు. **నందలూరు :** బస్టాండు కూడలిలోని దుకాణదారులతో ఎస్ఐ వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. దుకా ణాదారులు దుకాణాల్లోని చెత్తను రోడ్లపై పడవేయొద్దని, పంచాయతీ వారి వాహనంలో వేయాలని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ప్రజలు కూడా ఆ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ షామీర్‌బాషా, పోలీసులు దర్బార్‌బాషా, చెన్నయ్య, హోంగార్డు శ్రీనివాసులు పాల్గొన్నారు.


.నందలూరు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారస్తులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

మండల అభివృద్ధికి సహకరించండి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా సమ న్వయంతో సహకరించాలని ఎంపిపి అనసూయమ్మ కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం సమావేశపు హాల్లో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి పలితాలు సాధించవచ్చునని సూచించారు. శాఖల వారిగా అధికారులు ఇప్పటివరకు జరిగిన ప్రగతి అభివృద్ధి కోసం చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ప్రజా ప్రతి నిధుల నుంచి వచ్చిన సమస్యలపై నివేదిక రూపొందించారు. ఈ సమ స్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల ద్వారా తగు చర్యలు తీసు కుంటామని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశం శాంతి యుతంగా జరిగింది. సాగింది సమావేశంలో వైస్ ఎంపిపి కరీం కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, ఎంఇఒ త్యాగరాజు, ఎపిఒ అంజనప్ప , ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

- ఆర్‌టిసి డిఎం వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మల్లయ్య కొండకు వచ్చే భక్తులకు ఆర్‌టిసి ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌టిసి మదనపల్లి డిపో వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డిప్యూటీ డిఎం జగదీష్, ఆర్‌టిసి సిఐ రేవతిలతో కలిసి మల్లయ్య కొండను సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప వారికి స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. మల్లయ్య కొండ కింద నుండి మల్లయ్య కొండకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. కొండపై బస్సులు నిలిపేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కంటే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటాము అన్నారు.


మల్లయ్యకొండను పరిశీలిస్తున్న డిఎం వెంకటరమణారెడ్డి

ముత్తూట్ ఫైనాన్స్‌లో సిబ్బంది చేతివాటం

- పరారీలో మేనేజర్


కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : స్థానిక రంగసముద్రం రోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో ఖాతాదారుల సొమ్ములో మేనేజర్ ఇమ్రాన్, మరికొంతమంది సిబ్బంది చేతివాటంతో లూటీ చేశారు. విషయం బయటకు పొక్కడంతో మేనేజర్ ఇమ్రాన్ పరారీ అయ్యాడు. శనివారం ముత్తూట్ ఫైనాన్స్ ఉద్యోగులను లోపల ఉంచి ఖాతాదారులు గేటుకు తాళం వేశారు. గత వారం రోజులుగా ముత్తూట్ విజిలెన్స్, ఆడిటింగ్ అధికారుల తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటికీ లెక్కలు తేలడంతో రోజురోజుకీ ఖాతాదారులు పుట్టుకొస్తున్నారు. దాదాపు 50 నుంచి రూ.60లు ఖాతాదారుల సొమ్ములను మరో ఖాతాలోకి మారుస్తూ డబ్బులను మేనేజర్ ఇమ్రాన్, సిబ్బంది కాజేసినట్లు సమాచారం. తమ ఖాతాలోని సొమ్ములను విడిపించుకునేందుకు వస్తే మేనేజర్ ఇమ్రాన్ లేడని తను వస్తేనే సొమ్ములు విడిపించేందుకు అవుతుందని తెలిపిన ముత్తూట్ అధికారులు.వారం రోజుల కిందట తన బంధువులతో కలిసి కిందిస్థాయి సిబ్బందిపై దౌర్జన్యానికి దిగి చంపేస్తామంటూ ముత్తూట్ మేనేజర్ ఇమ్రాన్ బంధువులు బెదిరించినట్లు ఖాతాదారులు తెలిపారు.దీనిపై పోలీసులు స్పందించి పరారీలో ఉన్న మేనేజర్ ఇమ్రాన్ ను తీసుకొని తమకు న్యాయం చేయాలని ఖాతాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఎస్‌బిఐ నూతన శాఖ ప్రారంభోత్సవంలో రీజినల్ మేనేజర్

ఎస్‌బిఐ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-గుర్రంకొండ

ఎస్‌బిఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం గుర్రంకొండలో ఎస్‌బిఐ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ గుర్రంకొండలో ఎస్‌బిఐ బ్రాంచ్ లేని కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శిరీష, ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మలిశెట్టి శ్యాంప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీ

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీలోని యు.వెంకటంపల్లి గ్రామానికి చెందిన కాకర్ల రాజమ్మకి శనివారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ సిఎం సహాయనిధి కింద మంజూరైన రూ. 1.12లక్షలు చెక్కును అందించారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ పేద ప్రజల పెన్నిధి, నియోజకవర్గ అభివృద్ధి అజెండాగా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోరుతూ, గ్రామ గ్రామాలు పర్యటించి ప్రజల సమస్యలు తీర్చి దిద్దుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. సిఎం సహాయనిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగప డుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు, జగదీశ్వర్ రెడ్డి, లింగుట్ల వెంకటరమణ, నారాయణ నాయుడు, మనోహర్‌నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీచందు

23న బిసి కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బీసీల కుల గణన-రిజర్వేషన్లు అంశంపై ఈ నెల 23న మదనపల్లెలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బహు జనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా భారతీయ సమాజంలో బిసి, ఒబిసిలే సగానికి పైగా జనాభా ఉన్నారన్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో, సమస్త వనరుల అవకాశాల్లో కేవలం పదినుంచి పదహైదు శాతం మాత్రమే వీరికి ఫలాలు అందుతున్నాయన్నారు. 1950 నుండి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినా, రాష్ట్ర, కేంద్ర విద్యా ఉద్యోగ రంగాలలో వెనుకబడ్డారని, వారి జనాభా ధామాషా ప్రకారం తగు ప్రాతినిధ్యం వాటా అందలేదన్నారు. 2025 దేశ, రాష్ట్ర జనగణలలో బిసి, ఒబిసి కులాలను నమోదు చేసి ఆకులాల సంఖ్యను వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజనసేన నాయకులు రాఘవేంద్ర యాదవ్, లక్ష్మీనారాయణ, హరి బాబు, మొగల్ సయ్యద్ బేగ్, మావిళ్ళ వెంకటేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పీలేరు

మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆర్‌సిఎం.పరశురాం నాయక్ తెలిపారు. శనివారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పీలేరు మండల ఎస్‌హెచ్‌జి మెగా రుణమేళా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.2కోట్ల రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రతి మహిళా తాము తీసుకున్న రుణం ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని తెలియజేశారు. పీలేరు మండల ఎపియం జోహార్‌బాషా మాట్లాడుతూ మహిళా సంఘాలలో తీసుకున్న రుణాలతో వారి జీవనోపాధిని మెరుగు పరచుకుని ప్రతి ఎస్‌హెచ్‌జి మహిళా లక్షధికారి కావాలని అన్నారు. స్వయం ఉపాధిని మెరుగు పరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పీలేరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమణ, ఫీల్డ్ ఆఫీసర్ తేజ రెడ్డి, సిసిలు, సంఘమిత్రాలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యా బోధనలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కొత్తబోయినపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.భారతి పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొత్త బోయి నపల్లి, తాళ్లపాక, గుండ్లూరు గ్రామాలకు చెందిన 21 ప్రాథమిక పాఠశాలలు, మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు యుపి పాఠశాల ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. మొత్తం వీరిని తొమ్మిది విభాగాలుగా విభజించి వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదవ తరగతిలో సి,డి గ్రేడ్ లో ఉన్న విద్యార్థులను ఎ, బి గ్రేడ్‌లకు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. బోధనా అంశాలు, పరీక్షలలో మంచి ఉత్తీర్ణత, పాఠశాల అభివృద్ధి, నూతన విద్యార్థుల చేరిక తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు భారతి